
సాక్షి ఒడిశా
మంగళవారం ׀ 11 ׀ మార్చి ׀ 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,71,264లు, బంగారం 20 మిల్లీగ్రాములు, వెండి 74 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



డోలోత్సవాలు ప్రారంభం

పర్లాకిమిడిలో డోలోత్సవాలు ప్రారభమయ్యాయి. ఘనంగా పూజలు జరిగాయి.

- 8లో



మా ముత్యాలమ్మకు పూజలు

మల్కన్‌గిరిలో బొడొజాతర ఘనంగా జరుగుతోంది. ముత్యాలమ్మకు పూజలు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

18న పీఎఫ్ కమిషనర్ కార్యాలయాల ఘెరావ్



కార్మిక భవనంలో ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో మహంతి తదితరులు

జయపురం: పీఎఫ్ కమిషనర్ కార్యాలయాన్ని ఈ నెల 18 వ తేదీన ఘెరావ్ చేయాలని జాతీయ ఈపీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ నిర్ణయించిందని కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి వెల్లడించారు. స్థానిక కార్మిక భవనంలో సోమవారం ఈపీఎఫ్ పెన్షనర్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు నళినీకాంత రత్ అధ్యక్షతన జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు తమ కష్టార్జితాన్ని కట్టి తిరిగి పొందలేకపోతున్నారని ఆరోపించారు. ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు ఇప్పటికైనా నెలకు రూ.9వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఏతో పాటు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు చేస్తున్నా పాలకులు స్పందించడం లేదన్నారు. ఆందోళనను ఉద్ధృతం చేసి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్న లక్ష్యంతో ఈ నెల 18న దేశ వ్యాప్తంగా పీఎఫ్ కమిషనర్ల కార్యాలయాల ముందు ధర్నా చేయనున్నామన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ దాస్

జయపురం: పోరాటం ద్వారానే హక్కులు సాధించలగమని నాన్ గెజిటెడ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమన్వయ సమితి కొరాపుట్ జిల్లా శాఖ అధ్యక్షుడు శశిభూషణ దాస్ అభిప్రాయపడ్డారు. స్థానిక యాదవ భవనంలో సోమవారం జరిగిన రాష్ట్ర నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సమన్వయ సమితి కొరాపుట్ జిల్లా శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాన్ గెజిటెడ్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతోందని విమర్శించారు. ఎప్పటి కప్పుడు నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల డిమాండ్లను విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. అందరూ ఒక్కటిగా నిలిచి ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రారంభ వేతనాలు సవరించాలని, కోవిడ్ సమయంలో తగ్గించిన డీఏ వెంటనే చెల్లింపు, ఇంటి అద్దెలు సమానంగా చెల్లించాలని, పూర్వ నియమం ప్రకారం సహాయం అందించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగాలను రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు.


కాంగ్రెస్ ఎమ్మెల్యేల ధర్నా



శాసన సభ ఆవరణలో గాంధీ విగ్రహం దగ్గర బైఠాయించిన కాంగ్రెసు సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్రంలో సగటు మహిళకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ పరిస్థితుల పట్ల ప్రభుత్వ చర్యలు శూన్యంగా పరిణమిస్తున్నాయి. రాష్ట్రంలో మహిళల పట్ల నేరాలు నిత్యకృత్యాలుగా మారి నేర సంఘటనలు పెచ్చుమీరుతున్నాయి. ఈ పరిస్థితి పట్ల ప్రభుత్వం వివరణ కోరుతూ శాసన సభ బడ్జెటు సమావేశాల్లో కాంగ్రెసు సభ్యులు రంకెలు వేశారు. వీరి గోడుని స్పీకరు పెడ చెవిన పెట్టడంతో పోడియం చుట్టుముట్టేందుకు విఫలయత్నం చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు స్పీకరు వరుసగా సభా కార్యక్రమాల్ని వాయిదా వేయడంతో సభ నుంచి బయటకు తరలి వచ్చి గాంధీ మహాత్ముని బొమ్మ దగ్గర బైఠాయించి నిరసన ప్రదర్శించారు.

60 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానంలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: స్థానిక యూజీఎంఐటీలో సోమవారం సంబాద్, అమో ఒడిశా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఆయా సంస్థలకు చెందిన అరవింద్ ప్రధాన్, డాక్టర్ ప్రదీప్ కుమార్ త్రిపాఠి, మానస్ రంజన్ ప్రధాన్ ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షించారు.

వరుసగా సభ వాయిదా



స్పీకరు పోడియం చుట్టుముట్టిన విపక్ష సభ్యులు

భువనేశ్వర్: రెండో విడత బడ్జెట్ సమావేశాలతో శాసన సభ దద్దరిల్లుతోంది. ఈ విడత సమావేశాలు తొలి నుంచి వాడీవేడిగా సాగుతున్నాయి. రెండు రోజుల విరామం తర్వాత సోమవారం ఉదయం యథాతథంగా సభా కార్యక్రమాలు ఆరంభం అయ్యాయి. ఆరంభం కావడంతో దివంగత సభ్యుడు అనంత దాస్ మృతి పట్ల విపక్ష నేత నవీన్ పట్నాయక్ సభలో సంతాప తీర్మానం ప్రతిపాదించారు. దీంతో సభలో కాసేపు సభ్యులంతా మౌనం ప్రదర్శించి సంతాపం ప్రకటించారు. ఆ తర్వాత సభ ఒక్కసారిగా మారు మోగింది. సంతాపం ముగియడంతో విపక్షాలు విరచుకు పడ్డాయి. సంబల్‌పూర్ ప్రాంతంలో బీజేపీ ఎమ్మెల్యే జయ నారాయణ మిశ్రా వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్, రాష్ట్రంలో మహిళలపై 'పెరుగుతున్న నేరాలు'పై ప్రతిపక్ష కాంగ్రెస్ శాసన సభ్యులు గందరగోళం సృష్టించారు. ఈ గందరగోళం మధ్య సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితుల దృష్ట్యా సభని మధ్యాహ్నం 12.09 గంటల వరకు వాయిదా వేసినట్లు స్పీకరు సురమా పాఢి ప్రకటించారు. అనంతరం సభా కార్యక్రమాలు పునః ప్రారంభించారు. విపక్షాల ధోరణిలో ఏమాత్రం మార్పు కానరాకపోవడంతో మరోసారి సభా కార్యక్రమాలు వాయిదా వేయడం అనివార్యమైంది. రెండో సారి సభని మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. అప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుండడంతో మరోసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఆశించిన మేరకు విపక్షాలు శాంతించక పోవడంతో నాలుగోసారి సాయంత్రం 4 గంటల వరకు సభని వాయిదా వేసినట్లు స్పీకరు ప్రకటించారు. శనివారం సంబల్‌పూర్‌లో జరిగిన అధికారిక కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి, సంబలపూర్ నియోజక వర్గం సభ్యుడు జయ నారాయణ మిశ్రా 1936లో కోశలను ఒడిశాలో విలీనం చేయడాన్ని 'చారిత్రక తప్పిదం'గా అభివర్ణించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సభలో వివరణ ప్రవేశపెట్టాలని బిజూ జనతా దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. జయ నారాయణ మిశ్రా వ్యాఖ్యలు అఖండిత ఒడిశాని ఖండఖండాలుగా చేసే పరిణామాల్ని ప్రేరేపిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర గీతాన్ని సభా ముఖంగా అవమానపరచడం ఎంత మాత్రం ఆమోద యోగ్యం కాదని బీజేడీ సభ్యులు ఆరోపించారు. ఈ పరిస్థితుల పట్ల ముఖ్యమంత్రి వివరణ అవశ్యమని పట్టుబట్టారు. మరోవైపు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై 'పెరుగుతున్న నేరాల' అంశాన్ని లేవనెత్తారు. ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ సభలోని వెల్‌లోకి దూసుకుని వెళ్లారు. సీనియర్ కాంగ్రెస్ సభ్యుడు తారా ప్రసాద్ బాహినీపతి యథాతథంగా స్పీకర్ పోడియంపైకి దూసుకెళ్లారు.

ఆశ కార్యకర్తల ఆందోళన



ర్యాలీలో పాల్గొన్న ఆశ కార్యకర్తలు

- వేతనాలు పెంచాలని డిమాండ్



డిప్యూటీ కలెక్టర్ నారాయణ మిశ్రోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఆశ కార్యకర్తల మహాసంఘం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా ఆశ కార్యకర్తల సంఘం సోమవారం ఆందోళన చేపట్టింది. ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షురాలు తమలా సాహుకార్, కార్యదర్శి గీతాంజలి హియాల్ నేతృత్వంలో జరిగిన ఆందోళనలో భాగంగా స్థానిక సమితి కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వచ్చిన ఆశ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ నారాయణ మిశ్రోకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ కార్యకర్తల సంక్షేమం కోసం తగురీతిలో స్పందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆశ కార్యకర్తలకు భారతీయ మజ్దూర్ సంఘం నాయకులు జోగేశ్వర్ దాస్ తదితరులు మద్దతు ప్రకటించారు.

కలెక్టర్ కార్యాలయం ఘెరావ్



ర్యాలీ నిర్వహిస్తూ వస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

రాయగడ: రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. రాష్ట్రాన్ని సమర్థంగా నడపలేని సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు శంకరరావు జిలకర్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో ఆ పార్టీ జిల్లా పరిశీలకురాలు ద్రౌపది మాఝి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర గవర్నర్ పేరిట ఒక వినతి పత్రాన్ని ఈ మేరకు అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్‌కు సమర్పించారు.



అదనపు కలెక్టర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాత్కాలిక వంతెన నిర్మాణం అడ్డగింత

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి బొదాపుట్ గ్రామ పంచాయతీ కబరగుడ గ్రామ సమీప నదిపై నిర్మిస్తున్న తాత్కాలిక వంతెన పనులను స్థానికులు అడ్డుకున్నారు. తకాల-మాది గ్రామాలను కలుపుతూ రోడ్డు ఉందని, దారిలో నది ఉందని తెలిపారు. వానాకాలంలో నది ఉద్ధృతంగా ప్రవహించి కబరగుడకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని చెప్పారు. వానాకాలంలో రోగులను ఆస్పత్రికి కూడా తీసుకెళ్లలేకపోతున్నామని, నదికి అవల వైపునే శ్మశానం కూడా ఉందని, వానాకాలంలో దహన సంస్కారాలు కూడా జరగడం లేదని పేర్కొన్నారు. ఇంత కష్టకాలంలో ఉంటే నదిపై కేవలం నాలుగు అడుగుల హ్యూమ్ పైపులు వేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. తాత్కాలిక వంతెన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నామని, శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. పనులను అడ్డుకున్న వారిలో బొదాపుట్ పంచాయితీ సర్పంచ్ కృష్ణ ఖొత్ర,సుందర గదబ,జొగ గదబ,బుద్ర గదబ,భగవాన్ శిశ, జగబందు గదబ,లెరి గదబ తదతరులు ఉన్నారు.



నదిపై వంతెన నిర్మాణం అడ్డుకున్న గ్రామస్తులు

అంబులెన్స్‌ను ఢీకొట్టిన గూడ్స్ రైలు

- సురక్షితంగా బయటపడిన రోగులు
- తప్పిన పెను ప్రమాదం



అంబులెన్స్‌ను ఢీకొన్న గూడ్స్‌రైలు



సంఘటన స్థలం వద్ద డీఆర్ఎం సింఘాల్, ఇతర అధికారులు

రాయగడ: చికిత్స కోసం రోగులను తీసుకెళ్తున్న అంబులెన్స్ ప్రమాదానికి గురైంది. కొరాపుట్-రాయగడ రైల్ మార్గంలో భళుమస్క, సికరపాయి రైల్వేస్టేషన్ మధ్య అంబులెన్స్‌ను కొరాపుట్ నుంచి వస్తున్న గూడ్స్ రైలు సోమవారం ఢీకొంది. అయితే గూడ్స్ డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి బ్రేకు వేయడంలో అంబులెన్స్‌లోని రోగులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా బయటపడ్డారు. అయితే అంబులెన్స్ మాత్రం నుజ్జునుజ్జయ్యింది. వివరాల్లోకి వెళితే.. అనంత ఐ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ కళ్యాణసింగుపూర్ సమితి సికిరపాయి పంచాయతీలోని కానిపాయి, కంచోమోజురి, జుకుడు, బెతలొంక తదితర గ్రామాలకు చెందిన ఎనిమిది మంది రోగులను కంటి ఆపరేషన్ల కోసం సికరపాయికి అంబులెన్స్‌లో తీసుకువస్తున్న సమయంలో భళుమస్క, సికరపాయి మార్గం మధ్య లెవెల్ క్రాసింగ్ దాటుతుండగా హఠాత్తుగా గూడ్స్ రైలు ఢీకొంది. సుమారు వంద మీటర్ల వరకు అంబులెన్స్‌ను ఈడ్చుకుంటూ పోయింది. అయితే ఎనిమిది మంది రోగులతో పాటు డ్రైవరు, ఆశ కార్యకర్తలతో కలిసి మొత్తం పది మంది ప్రాణాలతో బయటపడగలిగారు. సమాచారం తెలుసుకున్న డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భళుమస్క, సికరపాయి మధ్య ప్రజల రాకపోకలకు సంబంధించి మధ్యలో ఉన్న రైలు క్రాసింగ్‌ను దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఈ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని ఎప్పటి నుంచో గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

- వైభవంగా లక్ష తులసీ దళ అర్చన పూజలు



లక్ష తులసీ దళ అర్చన పూజల్లో మహిళలు

రాయగడ: జేకేపూర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర మందిర 49వ వార్షికోత్సవంతో పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం మందిరం ప్రాంగణంలో లక్ష తులసీ దళ అర్చన పూజలు శ్రీనివాసాచార్యుల బృందంచే అత్యంత ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు స్వామివారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. స్వామి వారికి విశేష పూజలతో పాటు శ్రీరామ స్తూపానికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 13వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షులు పట్నాన గౌరి శంకరరావు తెలిపారు.



శ్రీనివాసాచార్యుల బృందం పూజా కార్యక్రమాలు



శ్రీరామ స్తూపం

అగ్నిగంగమ్మ జాతర ప్రారంభం



పూజలందుకుంటున్న అగ్నిగంగమ్మ అమ్మవారు



మందిర ప్రవేశ ద్వారం

రాయగడ: రాయగడకు సమీపంలోని నీలావడి అమ్మవారి వార్షిక జాతర సోమవారం నుంచి ప్రారంభమయ్యింది. ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించేలా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం సంప్రదాయ బద్ధంగా అమ్మవారి పాదాలను ఊరేగింపుగా తీసుకువచ్చి పూజా మండపంలో నిలపడం ద్వారా జాతరకు శ్రీకారం చుట్టారు. తొమ్మిది రోజులు జరగనున్న అమ్మవారి జాతరను తిలకించేందుకు ఇటు ఒడిశా అటు ఆంధ్రాకు చెందిన వేలాది మంది భక్తులు వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి జాతర ముగింపు రోజున రెండు లక్షల మందికిపైగా భక్తులు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యాలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా క్యూలైన్‌లో నిలబడి అమ్మవారి దర్శనం కోసం ఉండే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ శ్రేణుల ధర్నా



జిల్లా కలెక్టరేట్ గేటు వద్ద కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

పర్లాకిమిడి: గత ఎనిమిది నెలల్లో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, గ్యాంగ్ రేప్‌లు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతున్నా సీఎం మోహన్ చరణ్ మఝి, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మోహన ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు దాశరథి గోమాంగో ఆరోపించారు. మహిళపై నేరాలు చేస్తున్న వారిపై పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక కాంగ్రెస్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకూ కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ రాష్ట్ర అబ్జర్వర్ దుర్గా పండా, మానస చౌదురి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బసంత పండా, మోహన కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రతినిధి కున్నా మఝి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అక్కడ కాంగ్రెస్ శ్రేణులు ధర్నా చేశాయి. గత ఎనిమిది మాసాలుగా 1600 మంది ఎస్సీ, ఎస్టీ, దళిత నారీమణులపై నేరాలు జరుగుతున్నా రాష్ట్ర హోం శాఖ పట్టించుకోవడం లేదని, అలాగే గజపతి జిల్లాలో పర్లాకిమిడి అన్వేషా ఎస్సీ, ఎస్టీ బాలికల హాస్టల్‌లో గిరిజన విద్యార్థిని వేధించిన సూపరింటెండెంట్‌ను బదిలీ చేశారని కానీ అరెస్టు చేయలేదని మోహన ఎమ్మెల్యే దాశరథి గోమాంగో ఆరోపించారు. ఢెంకనాల్‌లో ఏడుగురు ఒక వివాహితపై గ్యాంగ్ రేప్ చేశారని, బర్‌ఘడ్‌లో ధనుయాత్రలో ఒక అమ్మాయిపై నాలుగురోజుల పాటు గ్యాంగ్ రేప్ చేశారని అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ఈ అంశంపై విపక్ష కాంగ్రెస్ నాయకులు ప్రశ్నలు లేవనెత్తనున్నారని ఎమ్మెల్యే దాశరథి గోమాంగో అన్నారు. అనంతరం జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్‌కు గవర్నర్‌కు అడ్రస్ చేస్తూ రాసిన వినతిని అందజేశారు. కాంగ్రెస్ ర్యాలీలో మోహన, నువాగడ, ఆర్.ఉదయగిరి, రాయఘడ, మహేంద్రగడ, గుమ్మా నుంచి అధిక కాంగ్రెస్ మహిళా శ్రేణులు పాల్గొన్నారు.



ఏడీఎం రాజేంద్ర మింజ్‌కు గవర్నర్‌కు రాసిన వినతిని అందజేస్తున్న మోహనా (కాంగ్రెస్) ఎమ్మెల్యే దాశరథి గోమాంగో



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

క్లుప్తంగా

ప్రజా ప్రతినిధులపై క్రిమినల్ కేసులు: ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులపై పలు కేసులు నమోదు అయ్యాయి. ఈ మేరకు పూర్తి వివరాలు సోమవారం జరిగిన సభలో ప్రవేశ పెట్టారు. విపక్ష ఉప నేత ప్రసన్న ఆచార్య అడిగిన ప్రశ్నకు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్ శాసన సభ బడ్జెటు సమావేశాల్లో ఈ వివరాలు ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం.. మాజీ, ప్రస్తుత ఎంపీలపై 22 సాధారణ కేసులు, 39 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో మాజీ, సిట్టింగ్ ఎమ్మెల్యేలు 115 కేసులను ఎదుర్కొంటున్నారు. వారిపై 418 క్రిమినల్ కేసులు నమోదైనట్లు మంత్రి సభలో వివరాలు ప్రవేశ పెట్టారు. వీటిలో 384 కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయి. 14 కేసులలో విచారణ పూర్తయింది. మరో 43 కేసులకు సంబంధించి దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసుల్లో 198 కేసులు పూర్తిగా రాజకీయ స్వభావం కలిగినవిగా గుర్తించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జయపురం: జయపురం రైల్వే స్టేషన్‌లో స్పృహ లేకుండా పడి ఉన్న అపరిచిత వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు నిర్ధారించారని జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ సోమవారం వెల్లడించారు. జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధి గగణాపూర్ పోలీసు పంటి పరిధిలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఒక వ్యక్తి స్పృహలేకుండా పడి ఉన్నట్లు, కున నాయిక్ అనే వ్యక్తి ఫోన్ ద్వారా తెలియజేశారన్నారు. పోలీసులు వెళ్లి అతన్ని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారని అయితే అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారని పోలీసు అధికారి జచీంద్ర ప్రధాన్ వెల్లడించారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు.

గుణుపూర్‌లో 40 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సద్భావన సమావేశం హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహోరో ఆధ్వర్యంలో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. గుణుపూర్ పరిసర ప్రాంతాలకు చెందిన 40 వినతులను అధికారులు స్వీకరించారు. వీటిలో 27 వ్యక్తిగతమైనవి కాగా 13 గ్రామ సమస్యలుగా గుర్తించారు. జిల్లా ఎస్పీ శ్వాతి ఎస్ కుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పర్లాకిమిడి: స్థానిక ఏడో వార్డు గంగులువారి వీధికి చెందిన గోపి బెహారా (40) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటి తల్లిరాగా.. కుమారుడు గోపి బెహారా ఉరివేసుకొని వేలాడుతూ ఉండటాన్ని గమనించింది. దీంతో ఈ విషయమై కుమారీ బెహారా సోమవారం ఉదయం తమకు ఫిర్యాదు చేసినట్టు ఆదర్శ పోలీస్‌స్టేషన్ సిబ్బంది తెలిపారు. పోలీసు స్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి ఆదేశాల మేరకు ఎస్సై కౌతికా శెఠి కేసు నమోదు చేశారు. గోపి బెహారా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలిపారు.

12న జాబ్ మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్-ఎంటర్ ప్రైస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంయుక్తంగా 12న పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నాయి. ఈ మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ కిరణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో సంక్యు ఇండియా, డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తాయని, సంక్యు ఇండియా కంపెనీ ప్యాకింగ్ - హెల్పర్స్ (65 ఖాళీలు) ఉద్యోగాలకు 7వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన 18-40 సంవత్సరాల వయస్సు గల పురుషులను ఎంపిక చేస్తుందని చెప్పారు. జీతం నెలకు రూ.12,000 ఉంటుందన్నారు. డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీ ట్రైనీ కెమిస్ట్ (50 ఖాళీలు) ఉద్యోగాలకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీజెడ్‌సీ విద్యార్హత కలిగిన 18-27 సంవత్సరాల వయస్సు గల పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీతం రూ.17వేలు వరకు వస్తుందన్నారు. ఈ ఉద్యోగ మేళా 12న ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతపట్నంలో జరుగుతుందని, అభ్యర్థులు రేషన్ కార్డ్/ఆధార్ కార్డ్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బయోడేటాతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7989744612 నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.

మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి



మిల్లు ప్రధాన గేటుముందు ఆందోళన చేస్తున్న విశ్రాంత కార్మికులు



ఆందోళనలో కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి తదితరులు

జయపురం: మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని గగణాపూర్‌లోని సేవా పేపరుమిల్లు ప్రధాన గేటువద్ద విశ్రాంత కార్మికులు, మృత కార్మికుల కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన చేపట్టారు. సేవాపేపరుమిల్లు ప్రథమ యూనిన్ అధ్యక్షులు, ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ మహంతి నేతృత్వంలో నిర్వహించిన ఆందోళనలో మృత కార్మికుల వితంతు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిల్లు యూనిట్ హెడ్ ఎస్.ఎస్.పాల్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్మిక నేత మహంతి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో, ఉద్యోగ విమరణ తరువాత మరణించిన కార్మికుల కుటుంబాలకు చట్టపరంగా లభించాల్సిన బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. 2020 ఫిబ్రవరి 26వ తేదీన మిల్లును కొత్త కంపెనీకి అమ్మివేసిందని, మిల్లు నడిపేందుకు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించేందుకు 2020 నుంచి 2023 మధ్య కాలంలో రూ. 200 కోట్లు అప్పుచేసిందన్నారు. అందులో పాత యజమాని రూ. 100 కోట్లు తీసుకున్నట్లు మహంతి వెల్లడించారు. బిజినెస్ ట్రాన్షపర్ అగ్రిమెంట్ ప్రకారం రూ. 15 కోట్లు చెల్లించేందుకు నిర్ణయించారని గుర్తు చేశారు. మరణించిన కార్మికులు మిల్లు కోసం శ్రమశక్తిని దారబోశారన్నారు. ఇప్పుడు యాజమాన్యం 75, 80 ఏళ్ల వయసు అధికారులకు లక్షలాది రూపాయలు ఇస్తుందని, వారికి గెస్ట్ హౌస్‌లు, ఉచిత భోజనం, వెహికల్ సమకూర్చుతోందన్నారు. అయితే మిల్లులో చెమటోడ్చి పనిచేసిన మృత కార్మిక కుటుంబాలు దుర్భర జీతితం గడుపుతున్నా.. వారికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించటం లేదని దుయ్యబట్టారు. చివరకు పీఎఫ్ డబ్బులను కూడా తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. దాదాపు 39 మంది విశ్రాంత కార్మికులతోపాటు మరికొంత మంది కంట్రాక్ట్ కార్మికులు మరణించడంతో వారి కుటుంబాలు దర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా వారికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



కొరాపుట్‌లో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



నబరంగ్‌పూర్‌లో ప్రసంగిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ లిఫికా మజ్జి

కొరాపుట్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్రంలో మహిళలపై లైంగికదాడులు జరగడం దారుణమన్నారు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రాలలో భారీ ర్యాలీలు నిర్వహించి కలెక్టరేట్ల వద్ద సభలు నిర్వహించారు.

నేరాలపై మౌనమెందుకు..?: కాంగ్రెస్



శాసన సభ ప్రాంగణంలో కాంగ్రెస్ సభ్యుల ఆందోళన

భువనేశ్వర్: రాష్ట్రంలో నేరాలు పెరుగుతున్నాయి. ప్రధానంగా మహిళల భద్రత పెద్ద సమస్యగా తాండవిస్తుంది. మరో వైపు ప్రభుత్వం చోద్యం చూస్తోందని రాష్ట్ర కాంగ్రెస్ ఆరోపించింది. మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, ప్రభుత్వ ఉదాసీనత్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ విమర్శించింది. శాసన సభ లోపల, బయట ఆందోళనలు నిర్వహించింది. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ప్రధాన కార్యాలయాల ముట్టడి, గవర్నరుకు వినతి పత్రం సమర్పణ కార్యక్రమం విజయవంతంగా చేపట్టింది. రాష్ట్రంలో మహిళలతో పాటు బాలికలకు రక్షణ కొరవడింది. సోమవారం జరిగిన శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో 2020 సంవత్సరం ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి మధ్య రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 72 మంది విద్యార్థుల ఆత్మహత్య కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ రాష్ట్ర అసెంబ్లీకి ఈ విషయాన్ని లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు. శాసన సభ సమర్పించిన వివరాల ప్రకారం జనవరి నెలలో 111 హత్య కేసులు, 20 దోపిడీ కేసులు, 1,509 దొంగతనం కేసులు నమోదయ్యాయి. అదనంగా, 194 సైబర్ క్రైమ్ కేసులు, 655 దుష్ప్రవర్తన కేసులు కూడా నమోదయ్యాయి. ఈ గణాంకాలు రాష్ట్రంలో భద్రతా పరిస్థితి పట్ల తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తాయి.



ఏడీఎం కార్యాలయం ఎదురుగా భువనేశ్వర్ జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకుల ధర్నా



రాష్ట్ర గవర్నరుని ఉద్దేశించిన స్మారక పత్రం కలెక్టరుకు అందజేస్తున్న కటక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ఊరేగింపుగా మౌలిమా మందిరానికి బయలుదేరిన దేవతామూర్తులు

మల్కన్‌గిరిలో నిర్వహిస్తున్న బోడ జాతర మూడో రోజు సోమవారం ముత్యాలమ్మను భక్తులు దర్శించుకున్నారు. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీష్‌గఢ్, తెలంగాణా నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుల కోసం రిటైర్డ్ ఉద్యోగులు మజ్జిగ, నిమ్మ రసం పంపిణీ చేశారు. ఉత్కళ సమ్మెళనం సంఘం వారు కూడా భక్తులకు మజ్జిగ అందించారు.

మల్కన్‌గిరి



అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

3,738 మంది చొరబాటుదారులను గుర్తించాం: ముఖ్యమంత్రి

భువనేశ్వర్ : రాష్ట్ర వ్యాప్తంగా 3,738 మంది బంగ్లాదేశ్ జాతీయులను గుర్తించామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం రాష్ట్ర శాసన సభలో తెలిపారు. వారిని బహిష్కరించే విషయం పరిశీలనలో ఉందన్నారు. రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ చొరబాటుదారులను గుర్తించి వారిని బహిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందో తెలుసుకోవాలనుకున్న బీజేపీ ఎమ్మెల్యే మానస్ కుమార్ దత్తా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి ఈ సమాధానం ఇచ్చారు. మానస్ కుమార్ దత్తా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఒడిశా ప్రభుత్వం రాష్ట్రంలో నివసిస్తున్న 3,738 మంది బంగ్లాదేశ్ జాతీయులను గుర్తించిందని అనుబంధ గణాంకాలు ప్రవేశ పెట్టారు. బంగ్లాదేశీయ చొరబాటుదారులు అత్యధికంగా నాలుగు జిల్లాల్లో ఉన్నారు. ఈ జాబితా ప్రకారం కేంద్రాపడాలో అత్యధికంగా 1,649 మంది, జగత్సింగ్‌పూర్ ప్రాంతంలో 1,112 మంది, మల్కన్‌గిరిలో 655, మరియు నవరంగపూర్ ప్రాంతంలో 106 మంది ఉంటున్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో వివిధ క్రిమినల్ కేసుల్లో 41 మంది బంగ్లాదేశ్ జాతీయులు ఉన్నట్లు తేలిందని ముఖ్యమంత్రి తన సమాధానంలో సభకు తెలియజేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు (ఎస్పీలు) తమ తమ అధికార పరిధిలోని బంగ్లాదేశ్ చొరబాటుదారులను గుర్తించాలని ఆదేశించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



హిరమండలం: బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన భార్య, సమయానికి రాకపోవడంతో మండలంలో ధనుపురం గ్రామ సమీపంలోని తోటలో చెట్టుకు ఉరేసుకొని గొర్లె కన్నారావు (34) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరుకు చెందిన కన్నారావు దంపతులు ఊరూరా గాడిద పాలు అమ్ముకొని జీవనం సాగిస్తుంటారు. ధనుపురం స్పైసీ దాబా సమీపంలోని ఖాళీ గదుల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్నిరోజులుగా దంపతుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల అతడి భార్య ఆమె చెల్లెలు ఉన్న కవిటి గ్రామానికి వెళ్లింది. ఆదివారం తిరిగి వస్తానని చెప్పి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కన్నారావు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తల్లి జి.సీతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎండీ యాసిన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య, ఎనిమిదేళ్ల పాప, ఆరేళ్ల బాబు ఉన్నారు.

పర్లాకిమిడిలో డోలోత్సవాలు ప్రారంభం



శ్రీజగన్నాథ మందిరం నుంచి రాధాకృష్ణుల విగ్రహాలను పల్లకిలో మోసుకువెళుతున్న అర్చకులు



రాజావారి ప్యాలెస్‌లో శాస్త్రోక్తంగా పూజలు

పర్లాకిమిడి: స్థానిక డోలా ట్యాంకు రోడ్డులో డోలా ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీజగన్నాథ మందిర ప్రాంగణంలో ఉన్న రామస్వామి మందిరం నుంచి రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను పల్లకీపై మోసుకు వచ్చి గజపతి ప్యాలెస్‌లోకి తీసుకెళ్లారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం కోటలో మహారాజా బ్రాహ్మణులు విచ్చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం అనేక పురవీధులలో రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాల పల్లకిని మోసుకువెళుతూ పోగో (రంగులు) జల్లారు. పర్లాకిమిడి సముటియా వీధి సంకీర్తన మండళి, కె.సీతాపుచం, సుందరాడ, యువరాజపురం, జాజిపురం గ్రామాలనుండి ప్రభు శ్రీక్రిష్ణుని భక్తి భజనలు పాడుకుంటూ డోలా ట్యాంకు వద్దకు తీసుకువెళ్లారు. చివరికి డోలా ట్యాంకు వద్ద ఉత్సవ మూర్తులను ఉంచి భక్తులు సమర్పించిన పువ్వులు, టెంకాయలు, ప్రసాదాలు స్వీకరించారు. డోలా ఉత్సవాలు ఈనెల 15 వరకూ డోలా ట్యాంకు వద్ద కొనసాగుతాయని డోలోచెరువు అభివృద్ధి కమిటీ సభ్యులు తెలియజేశారు.



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న సంకీర్తన భజన మండలి



తిరువీధి ఉత్సవంలో రాధాకృష్ణుల ఉత్సవ మూర్తులు

హాస్టల్ నిర్వాహకులపై చర్యకు డిమాండ్



సంక్షేమ శాఖ అధికారిని ముట్టడించిన విద్యార్థుల తల్లిదండ్రులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అన్వేష హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి ఘటనకు సంబంధించి దర్యాప్తు చేసేందుకు ఆదివారం సాయంత్రం వెళ్లిన జిల్లా సంక్షేమ శాఖ అధికారి అసీమా రావ్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు ఘెరావ్ చేశారు. హాస్టల్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుదూర గ్రామాల నుంచి తమ పిల్లలను చదువుకునేందుకు హాస్టల్‌కు పంపిస్తున్నామని అయితే ఇటువంటి తరహా ఘటనలు చోటు చేసుకుంటే తమ పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక విద్యార్థిపై ఇంతమంది మూకుమ్మడిగా దాడి చేస్తుంటే హాస్టల్ సూపరింటెండెంట్, వార్డన్ చోద్యం చూస్తున్నారా అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన విద్యార్థులను వేరే చోటుకు తరలించాలని, సూపరింటెండెంట్, వార్డన్‌లపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పిల్లలను హాస్టల్‌కు పంపేది లేదని, అవసరమైతే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. దీనికి విచారణాధికారి మాట్లాడుతూ.. నిజానిజాలు తెలుసుకున్న అనంతరం పూర్తి వివరాలతో నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి బాధ్యులపై తగు చర్యలు తీసుకునేలా తనవంతు సహకరిస్తానని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రావ్ హామీ ఇచ్చారు.

కొరాపుట్‌కు ప్రియాంక చోప్రా



జగదల్‌పూర్ ఎయిర్ పోర్టులో ప్రియాంక చోప్రా



జగదల్‌పూర్ ఎయిర్ పోర్ట్ లో ఎయిర్ హోస్టస్‌లతో ప్రియాంక చోప్రా

కొరాపుట్: హిందీ సినిమా హీరోయిన్ ప్రియాంక చోప్రా కొరాపుట్ జిల్లాలో అడుగు పెట్టారు. సోమవారం చత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్ విమానాశ్రయంలో దిగారు. గట్టి భద్రత మధ్య సిమిలిగుడ పట్టణం చేరుకున్నారు. రాజమౌళి బృందం ప్రియాంక చోప్రాకి స్వాగతం పలికింది. ఆదివారం ఈ సినిమా చిత్రీకరణలో కొంతభాగం బయటకు లీక్ అయింది. దీంతో రాజమౌళి బృందం మరింత జాగ్రత్త పడింది.

వినతుల వెల్లువ



పర్లాకిమిడి: గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు



మల్కన్‌గిరి: దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేస్తున్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా బ్లాక్‌లో పరిడా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రీవెన్సు సెల్ సోమవారం జరిగింది. ఈ స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి సి.డి.ఎం పృధ్వీరాజ్ మండల్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. గ్రీవెన్సు సెల్‌కు ప్రజల నుంచి మొత్తం 71 వినతులు అందాయి. వీటిలో గ్రామ సమస్యలు 44, వ్యక్తిగతం 27 ఉన్నాయి. వీటిలో యోగ్యమైన వినతులను వెంటనే పరిష్కరించాలని గుమ్మా బ్లాక్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గుమ్మా పంచాయతీ సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్, సి.డి.ఎం.ఓ డాక్టర్ ఎం.ఎం. అలీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఖోయిర్‌పూట్ సమితిలో..

మల్కన్‌గిరి: జిల్లా ఖోయిర్‌పూట్ సమితి తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యం సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. 71 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కుడుములగూమ్మ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పీఎం అవాస్ పథకం ద్వారా మంజూరైన గృహాలను పరిశీలించారు. గ్రామంలోని నృసింహ స్వామి ఆలయానికి రహదారి నిర్మించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. 80 శాతం అంగవైకల్యం ఉన్న ఇద్దరికి ప్రభుత్వ సహాయం కోసం ఎంపిక చేశారు. ఎస్పీ వినోద్ పటేల్, ఖోయిర్‌పూట్ తహసీల్దార్ కృష్ణచంద్ర దాస్, మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ దూర్యోధన్ బోయి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరేష్ చంద్ర శభర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముందుచూపు తప్పనిసరి

- గ్లకోమాపై నిర్లక్ష్యం.. కంటి చూపుపై ప్రభావం
- వ్యాధి బారినపడకుండా జాగ్రత్తలు అవసరం
- వైద్యుల సూచనలు తప్పనిసరి.
- 40 ఏళ్లు దాటితే రెండేళ్ల కోసారి నేత్ర పరీక్షలు చేయించుకోవాలి.
- ఈ నెల 15వరకు గ్లకోమా వారోత్సవాలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ నగేష్ రెడ్డి

రాజాం సిటీ/పార్వతీపురంటౌన్: సృష్టిలో ప్రకృతి అందాలను వీక్షించాలంటే కంటి చూపు తప్పనిసరి. జ్ఞానేంద్రియాలన్నింటిలోను కంటి చూపు చాలా ప్రాధాన్యం కలిగి ఉంటుంది. మనిషి పుట్టిన నాటి నుంచి మరణించేవరకు మంచి దృష్టితో జీవించాలని కోరుకుంటాడు. అయితే కంటి ఆరోగ్యం, కంటి దృష్టిపై అవగాహనలేక చాలా మంది అంధత్వం బారిన పడుతున్నారు. కంటి శుక్లాలు, కంటి వక్రీభవన దృష్టి లోపాలు, గ్లకోమా వంటివి అంధత్వానికి ప్రధాన కారణం. గ్లకోమాను నీటి కాసులుగా కూడా పిలుస్తారు. గ్లకోమా వ్యాధితో ఒక్కసారి దృష్టిని కోల్పోతే తిరిగి పొందలేము. 40 ఏళ్లు పైబడిన వారిలో 1.12 శాతం గ్లకోమా వ్యాధితో బాధపడుతున్నవారే అధికం. ఈ వ్యాధి మనకంటిలోని ఆప్టిక్ నాడికి నష్టం కలిగించడం ద్వారా దృష్టిని క్రమక్రమంగా క్షీణించేలా చేస్తుంది. గ్లకోమాలో సాధారణంగా ప్రారంభదశలో ఎటువంటి లక్షణాలు కనిపించవు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చాపకింద నీరులా ఈ వ్యాధి వ్యాప్తి చెంది శాశ్వత అంధత్వానికి దారితీస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా మార్చి 9 నుంచి 15 వరకు ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు జిల్లా అంధత్వ నివారణ సంస్థ నిర్వహిస్తుంటుంది. ఈ ఏడాది 'గ్లకోమా రహిత ప్రపంచం కోసం ఐక్యమవుదాం' అనే నినాదంతో కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తద్వారా ఈ వ్యాధి వల్ల సంక్రమించే అంధత్వాన్ని నివారించవచ్చు.

గ్లోకోమా వ్యాధికి ప్రధాన కారణాలు..

- పెరిగిన కంటి పీడనం
- ఆప్టిక్ నాడి సన్నబడడం లేదా లావుగా మారడం
- కార్నియా పల్చబడడం
- కంటిలో కోణం సన్నబడడం
- గ్లకోమా కుటుంబ చరిత్ర కలవారు
- చక్కెర వ్యాధి కలవారు
- గాయాల బారిన పడడం
- స్టెరాయిడ్స్ వాడకం ద్వారా

ఇతర కంటి వ్యాధుల వల్ల సంక్రమించే సెకండరీ గ్లకోమా..

సాధారణంగా గ్లకోమాను మూడు రకాలుగా చెప్పవచ్చు. 1. ఓపెన్ యాంగిల్ గ్లకోమా, 2. క్లోజ్డ్ యాంగిల్ గ్లకోమా, 3. తక్కువ ఒత్తిడి గ్లకోమా, చిన్నారులకు వచ్చే కంజెంటల్ గ్లకోమా. ఓపెన్ యాంగిల్ గ్లకోమాలో ఒక వ్యక్తి దృష్టిని పూర్తిగా కోల్పోయే వరకు కూడా గుర్తించలేరు. క్లోజ్డ్ యాంగిల్ గ్లకోమాలో ప్రధానంగా తీవ్రమైన మసక, కళ్లు, తలనొప్పి, వికారం, వాంతులు, ప్రకాశవంతమైన లైట్ల చుట్టూ ఇంద్రధనుస్సు రంగు వృత్తాలు, ఆకస్మికంగా దృష్టి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

గ్లకోమాపై జాగ్రత్తలు తప్పనిసరి..




గ్లకోమా వ్యాధిపై ప్రతి ఒక్కరికీ జాగ్రత్తలు తప్పనిసరి. దీనిపై వైద్యసిబ్బంది, స్వచ్ఛంద నేత్ర వైద్య సంస్థలు విస్తృత ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. అప్పుడే గ్లకోమా వ్యాధి వల్ల కలిగే అంధత్వాన్ని నివారించగలం. దీనిని అందరూ సమైక్య బాధ్యతగా గుర్తెరగాలి.

– ఎస్.వసంతరావు, రొటేరియన్, ఆప్తాలమిక్ అధికారి, పెరుమాళి పీహెచ్‌సీ

గ్లకోమా నివారణకు చర్యలు..

- గ్లకోమా వ్యాధి కుటుంబ చరిత్ర కలవారు ముప్పై సంవత్సరాల వయసు నుంచే సమగ్ర నేత్ర పరీక్షలు(దృష్టి పరీక్ష, కంటిలో ఒత్తిడి, ఫంగస్ ద్వారా రెటీనా పరీక్షలు, క్షేత్ర దృష్టి పరీక్షలు) చేయించుకోవాలి.
- 40 సంవత్సరాలు వయసు దాటిన తరువాత క్రమం తప్పకుండా రెండేళ్లకు ఒకసారి సమగ్రంగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలి.
- వైద్యుల సలహా మేరకు మాత్రమే స్టెరాయిడ్ మందులు లేదా కంటి చుక్కల మందు వాడాలి.
- కంటి గాయాలను నిర్లక్ష్యం చేయకుండా నేత్ర నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందాలి.
- గ్లకోమా వ్యాధి నిర్ధారణ జరిగినప్పుడు నేత్ర నిపుణుల సలహా, సూచనల ప్రకారం నేత్ర పరీక్షలు చేసుకోవడం, మందులు వాడడం చేయాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా శాశ్వత అంధత్వం వస్తుంది.



సాధారణ, గ్లకోమా కన్ను

పార్వతీపుం మన్యం జిల్లా అంతటా గ్లకోమా సదస్సులు



ఈ వ్యాధి వచ్చినట్లు గుర్తించిన వెంటనే కంటి ఒత్తిడిని తగ్గించడమే దీనికి ప్రధాన చికిత్స. దీర్ఘకాలిక నియంత్రణ ఇచ్చే కంటి చుక్కల మందు, మాత్రల వాడకం చాలా ముఖ్యం. కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స కూడా చేయవలసి వస్తుంది. క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలి. గ్లకోమాను ముందుగా గుర్తిస్తే వైద్యం ద్వారా కళ్లను కాపాడుకోవచ్చు. జిల్లా అంతటా ప్రత్యేక గ్లకోమా అవగాహన సదస్సులు, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తాం.

– నగేష్ రెడ్డి, కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి, పార్వతీపురం

క్లుప్తంగా

ఇంటర్మీడియట్ 'ద్వితీయ' పరీక్షకు 372మంది గైర్హాజరు



డీవీఈఓ మంజుల వీణ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 372మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవీఈఓ మంజులవీణా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామని 7,880 మందికి గాను 7508 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. అందులో జనరల్ సబ్జెక్టు జువాలజీ-2 పరీక్షకు 4954 మంది హాజరు కావాల్సి ఉండగా 4812 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఒకేషనల్-2 పరీక్షకు 2926మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2696 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు కాని, మాస్‌కాపీయింగ్‌గాని జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్‌లు, బల్క్ మెంబర్లు పరీక్షలను పర్యవేక్షించారని, పరీక్షలు సీసీ కెమెరా లైవ్ స్ట్రీమింగ్ ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహించినట్లు వివరించారు.

కరాటేలో రెండు గోల్డ్ మెడల్స్



కరాటేలో పతకాలు సాధించిన చిన్నారులు

సీతంపేట: ఈనెల 9న విజయనగరంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో సీతంపేట మండలంలోని అచ్చిబ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు గోల్డ్‌మెడల్స్ సాధించారు. గ్రామానికి చెందిన కె.దీపక్, ఎస్.హర్షలు బంగారు పతకాలు సాధించడంతో గ్రామస్తులు వారిని సోమవారం అభినందించారు.

కారును ఢీ కొన్న లారీ

- కారు డ్రైవర్ మృతి
- మరో ఇద్దరికి గాయాలు



ప్రమాంలో నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం, డ్రైవర్ మృతదేహం

గరుగుబిల్లి: పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలో నుంకి జంక్షన్ వద్ద పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్న కారును ఖడ్గవలస నుంచి పార్వతీపురం వెళ్తున్న కర్రలలోడ్‌తో ఉన్న లారీ బలంగా ఢీ కొట్టడంతో జరిగిన ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ కుండింగి హరి ప్రసాద్ (29) కారులో తన సీటు, స్టీరింగ్ మధ్య ఇరుక్కోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే కారులో ఉన్న లవాల గౌరీశంకర్, బిడ్డిక శ్రీనులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు 108కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి హుటాహుటిన వచ్చి క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించింది. సమాచారం మేరకు ఎస్సై పి.రమేష్‌నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పీజీఆర్‌ఎస్‌కు పోటెత్తిన అర్జీదారులు

- వినతులను స్వీకరించిన కలెక్టర్ అంబేద్కర్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్



ఫిర్యాదలు స్వీకరిస్తున్న ఎస్పీ, ఏఎస్పీలు

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు అర్జీదారులు పోటెత్తారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పునఃప్రారంభించిన ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో వినతులు అందాయి. కలెక్టర్ డాక్టర బీఆర్‌అంబేద్కర్, ఇన్‌చార్జ్ జేసీ ఎస్.శ్రీనివాసమూర్తి, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ మురళి వినతులను స్వీకరించగా ఈ వారం మొత్తం 231 అర్జీలు వచ్చాయి.

తప్పుగా ఎండార్స్‌మెంట్ ఇస్తే క్రమ‌శిక్షణ చర్యలు

పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి అందిన వినతులకు ఏ విధమైన పరిష్కారం చూపిస్తున్నదీ సంబంధిత అర్జీదారుకు ఆయా ప్రభుత్వ శాఖలు తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ డాక్టర్ అంబేద్కర్ అధికారులకు స్పష్టం చేశారు. వినతుల పరిష్కారంలో తప్పుగా ఎండార్స్‌మెంట్ ఇచ్చి పరిష్కరించినట్లు పేర్కొంటే ఆయా అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఇప్పటికే తప్పుగా ఎండార్స్‌మెంట్ ఇచ్చిన 33 మంది అధికారులకు మెమోలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 37 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 37 ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించి 11, కుటుంబ కలహాలకు సంబంధించి 3, మోసాలకు పాల్పడినట్లు 10, ఇతర అంశాలకు సంబంధించి 13 ఫిర్యాదులు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్‌కే చౌదరి, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్, సిబ్బంది కృష్ణ, షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

- పీజీఆర్‌ఎస్‌కు 136 వినతులు

పార్వతీపురంటౌన్: పీజీఆర్‌ఎస్ ద్వారా అందిన వినతులపై అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 136 మంది అర్జీదారుల నుంచి వినతులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరారు. అర్జీదారుల విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టి అర్జీదారులను న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దిగువస్థాయి అధికారులను పంపి మొక్కుబడిగా పరిష్కారం చేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు.

పీజీఆర్‌ఎస్‌లో అందిన వినతుల్లో కొన్ని..

- పాచిపెంట మండలం కీరంగి నుంచి గ్రామ సర్పంచ్ లచ్చయ్య అర్జీని అందిస్తూ తమ మండల పరిధిలో చెక్‌డ్యామ్‌లు పాడైనందున వ్యవసాయానికి సాగునీరు అందడం లేదని చెక్‌డ్యాంలు మరమ్మతులు చేపట్టాలని కోరారు.
- పాలకొండ మండలం వాటపాగు నుంచి ఆర్.దుర్గాప్రసాదరావు దరఖాస్తులు అందిస్తూ తమ గ్రామంలో సర్వే నంబర్ 42-37లో తన వాటాగా సంక్రమించిన భూమిలోని ఐదు సెంట్లు జి. గౌరునాయుడు కబ్జా చేశారని తనకు న్యాయం చేయాలని కోరాడు.
- సాలూరు మండలం పెద్దవలస గ్రామానికి చెందిన కె.బంగార్రాజు తమ గ్రామంలో తన భూమి అన్యాక్రాంతమైందని, న్యాయం చేయాలని కోరాడు.
- జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామానికి చెందిన సాయిగీత వ్యవసాయ డిప్లమో చేసి ఖాళీగా ఉన్నానని తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరింది. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, ఇన్‌చార్జ్ జేసీ హేమలత, ఎస్‌డీసీ పి. ధర్మచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్, పశుసంవర్ధకశాఖాధికారి మన్మథరావు, డ్వామాపీడీ కె.రామచంద్రరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యల పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం రూరల్: సకాలంలో ఫిర్యాదు దారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి నిర్వహించారు. ఈ పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించి నేరుగా ఎస్పీ వారితో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేదింపులు, భర్త/అత్తారింటి వేదింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమపేరుతో వంచన వంటి పలు సమస్యలపై ఫిర్యాదు దారులు ఎస్పీకి విన్నవించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి వాటి పూర్వాపరాలపై విచారణ చేసి ఫిర్యాదులు వాస్తవాలు అయినట్‌లైతే చట్టపరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు.

ఐటీడీఏ గ్రీవెన్స్ సెల్‌కు 61 వినతులు

సీతంపేట: ఐటీడీఏ కార్యాలయంలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 61 వినతులు వచ్చాయి. ఈతమానుగూడ గ్రామానికి చెందిన ఎస్.సింహాచలం వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఎర్రకువ్వారి గ్రామానికి చెందిన త్రినాథ్ అడ్వెంచర్ పార్కులో షాపుపెట్టుకోవడానికి అనుమతి ఇప్పించాలని విన్నవించాడు. కుశిమి గ్రామస్తుడు నిమ్మక వరహాలు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ గ్రామంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాడు. డెప్పిగూడ గ్రామస్తురాలు నిమ్మక కల్యాణి కమ్యూనిటీ హెల్త్ వర్కర్ జాబ్ ఇప్పించాలని వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, డిప్యూటీ ఈవో ప్రసన్నకుమార్, పశుసంవర్ధకశాఖ ఎ.డి శ్రీనివాసరావు, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పీజీఆర్‌ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

శృంగవరపుకోట: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిగా ఉండి పోలీసులు కళ్లు గప్పి తిరుగుతున్న గంజాయి స్మగ్లర్‌ను సోమవారం ఉదయం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి చెప్పారు. 2023లో హోండా సిటీ కారులో 60కిలోల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో అనంతగిరి మండలం, డుంబ్రిగూడ గ్రామానికి చెందిన కె.శ్యామ్ ప్రధాన నిందితుడన్నారు. గతంలో చాకచక్యంగా తప్పించుకుని పరారై తిరుగుతున్న శ్యామ్‌ను సోమవారం తమకు అందిన సమాచారంతో నిఘా వేసి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

పార్వతీపురం: ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులు తదితర మైనా ర్టీలకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేయనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ఎస్ జాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 55ఏళ్ల లోపు ఉండి సంవత్సర ఆదాయం రూరల్ అభ్యర్థులకు రూ.1.50లక్షలు, అర్బన్ అభ్యర్థులకు రూ.2లక్షలు వార్షిక ఆదాయం ఉండాలన్నారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డుతో మీ సేవా కేంద్రంలో చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ 08922-230250, 9849901160, 94900 66050 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు ఎప్పుడు?

విజయనగరం గంటస్తంభం: కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ ఎగ్జామ్స్ నిర్వహించి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులను భర్తీ చేయాలని విజయనగరం కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌కు డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీష్, నిరుద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 2022 నవంబర్ 28న పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు 2023 జనవరి 22న ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించగా..95,208 మంది అర్హత సాధించారని చెప్పారు. ఆ తరువాత కోర్టు కేసులు, ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం 2024 డిసెంబర్ 22నుంచి జనవరి 16వరకు దేహదారుఢ్య, శారీరక సామర్థ్యం పరీక్షలు నిర్వహించారు. ఆ తరువాత మెయిన్స్ ఎగ్జామ్స్ గురించి ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో దాదాపు ఆరు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న అభ్యర్థులు పగలు, రాత్రనక, రీడింగ్ రూమ్‌ల్లో చదువుకుంటూ, రూమ్, కోచింగ్ అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని..పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, లక్ష్మణ, పాల్గొన్నారు.

అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ శ్రీనివాసమూర్తి

విజయనగరం ఫోర్ట్: అపరాలకు (పెసర, మినుము) సంబంధించి కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జ్ జేసీ శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం రాత్రి తన చాంబర్‌లో అపరాల కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వింటా మినుము ధర రూ.7400, పెసలు క్వింటా ధర 8682 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, మార్కెఫెడ్ డీఎం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ధారపర్తిని దగా చేసిందెవరు..?

- ల్యాబ్ రిపోర్టులు ఎక్కడ..?
- బాధ్యులపై చర్యలకు గిరిజన సంఘం డిమాండ్



చనిపోయిన కుమారుడి మృతదేహంతో రోదిస్తున్న తల్లి సన్యాసమ్మ (ఫైల్)

శృంగవరపుకోట: అభంశుభం తెలియని గిరిజన తల్లుల గర్భశోకం..ఎవరి పాపం. తీవ్రమైన జ్వరాలు, వంటిపై దద్దుర్లతో ఆస్పత్రి పాలైన చిన్నారుల తల్లుల శోకానికి, పాపానికి కారణం ఎవరన్న విషయమై వైద్యాధికారులు ఇంతవరకూ చెప్పలేదు. ఎస్.కోట మండలంలోని ధారపర్తి పంచాయతీ గిరిశిఖర గ్రామాల్లోని చిన్నారులు ఇటీవల తీవ్రజ్వరం, దద్దుర్లతో ప్రాణాపాయ స్థితిలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు పరిస్థితిని చక్కదిద్దినా, డబ్ల్యూహెచ్‌ఓ సపోర్టింగ్ టీమ్ సభ్యుడు చెనగపాడు గ్రామంలో పర్యటించి ఇచ్చిన రిపోర్టుతో తీగలాగితే డొంక కదిలినట్లు, వైద్యసిబ్బంది కట్టు కథ బయటికొచ్చింది. పిల్లల్లో తట్టు, పొంగు వ్యాధుల నివారణకు ఇచ్చే ఎంఆర్ వ్యాక్సిన్ సకాలంలో ఇవ్వక పోవడం వల్లనే జ్వరాలు, దద్దుర్లు వచ్చాయని, ఇవి తట్టు లక్షణాలేనన్న నిజం బయటకు వచ్చింది. దీంతో గత వారం రోజులుగా వైద్యారోగ్యశాఖ అధికారులు, క్షేత్రసిబ్బంది కొండపైకి పరుగులు తీస్తూ, ఈ వ్యవహారం నుంచి బయట పడేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎంసీపీ కార్డులు మాయం చేసి, ఎంఆర్ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కనిపించిన వారందరికీ వ్యాక్సిన్‌లు వేస్తున్నారు. ఇంతవరకూ వైరాలజీ ల్యాబ్ రిపోర్టులు ఏం చెప్పాయో తేల్చలేదు. దారపర్తి ఘటనపై విచారణకు ఆదేశించలేదు. దారపర్తిలో జ్వరాలకు కారకులైన క్షేత్రస్థాయి సిబ్బందిపై ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. ఇంతవరకూ 18మంది చిన్నారులు జ్వరం, దద్దుర్లతో ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందారు. మరో 14మంది చిన్నారుల శాంపిల్స్ వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. కాగా శాంపిల్ రిపోర్టులు బయట పెట్టలేదు. మరో 12మంది చిన్నారులు జ్వరాలు తదితర సమస్యలతో చికిత్స తీసుకున్నారు.

చర్యల కోసం డిమాండ్

పిల్లలకు వ్యాక్సిన్ వేయకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న క్షేత్రస్థాయి వైద్యసిబ్బందిపై కలెక్టర్ తక్షణం చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సంఘ నేతలు డిమాండ్ చేశారు. అంతరించిందనుకున్న తట్టు వ్యాధి వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో తిరిగి పురుడు పోసుకోవడం ప్రభుత్వానికే సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో చిన్నారులు చనిపోతే కనీస విచారణ లేకుండా జిల్లా అధికారులు చేతులు తుడిచేసుకున్నారని ధ్వజమెత్తారు. వైద్యాధికారులు వదిలేసినా, తాము ఈ విషయాన్ని వదిలిపెట్టబోమన్నారు. ఈ వ్యవహారంలో జిల్లా అధికారుల నుంచి ఫీల్డ్‌స్టాఫ్ వరకూ అందరూ భాగస్వాములేనని మండిపడ్డారు.

సంకల్పబలంతోనే విజయ తీరాలు

- డాక్టర్ బీఆర్‌ఏయూ వీసీ రెమి రజని

రాజాం సిటీ: మహిళలు ఆత్మవిశ్వాసంతో పాటు సంకల్పబలం ఉంటే విజయతీరాలను అందిపుచ్చుకోగలరని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.రెమి రజని అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక జీఎంఆర్ ఐటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు తమ శక్తిని బాధ్యతలను సమతుల్యం చేసుకునే విధానంపై వివరించారు. ప్రతి మహిళలో తనను తాను ముందుకు తీసుకువెళ్లే ఆత్మవిశ్వాసం, అద్భుతమైన సంకల్పం ఉండాలన్నారు. ఇలాంటి గుణాలు అలవర్చుకున్నప్పుడే ఏ రంగంలో అయినా విజయం సాధించగలమని తెలిపారు. మహిళలు ఎదగడమంటే కుటుంబం, ఒక సమాజం ఎదగడం ద్వారా సాధించిన మహిళా సాధికారతతో సమాజానికి వెలుగునిచ్చే మార్గాన్ని అందించగలమని అన్నారు. విశాఖపట్నం జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ లక్కీవర్మభాస్కర్ మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది ఒక మహిళ తన స్వేచ్ఛను, అవకాశాలను, హక్కులను సమాజంలో సమానంగా పొందే విధంగా ఉండాలని చెప్పారు. సమాజంలో మహిళలు వివిధ రంగాల్లో అగ్రగాములుగా ఎదగడం అవసరమని పేర్కొన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో పురుషులతో సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన పురోగతి సాధ్యమని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అంతకుముందు వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ బీఆర్ ఏయూ వీసీ రెమి రజని, లక్కీవర్మ భాస్కర్

నేడు కన్వర్జెన్స్ సమావేశం

పార్వతీపురం: కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం కన్వర్జెన్స్ సమావేశం నిర్వహిస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాప్టివ్ సీడ్ నర్సరీస్ ఏర్పాటుపై సమావేశంలో చర్చిస్తామన్నారు. ఇంజినీరింగ్, డ్వామా, ఇరిగేషన్, పంచాయతీ, డీఆర్‌డీఏ, మత్స్యశాఖ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆపరేటర్ ఖాతాలోకి ఆర్థిక సంఘం నిధులు

కొమరాడ: స్థానిక మండల పరిషత్ కార్యలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ఖాతాలోకి 15 ఆర్థిక సంఘం నిధులు జమకావడం చర్చనీయాంశంగా మారింది. 31 పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ రకాల పనులు చేపట్టారు. వీటిలో అధిక పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల డబ్బులు సుమారు రూ.15లక్షల నిధులు ఆయన ఖాతాలోకి మళ్లడం అనుమానాలకు తావిస్తోంది. సంబంధిత ఆపరేటర్ డిజిటల్ సంతకాలను (డీఎస్‌కే) తన వద్ద ఉంచుకుని దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని ఎంపీడీఓ మల్లికార్జునరావు వద్ద ప్రస్తావించగా.. పంచాయతీల్లో జరిగే పనులతో తనకు సంబంధం లేదని, పంచాయతీ విస్తరణ అధికారి, పంచాయతీ కార్యదర్శులే చూసుకుంటారని తెలిపారు.